

సంక్షేమం సున్నా..

పేదలకు చేయూతనివ్వడం.. వారు నిలదొక్కుకునేలా ప్రోత్సహించడం ప్రభుత్వాల పని. అంతే కానీ బడా పారిశ్రామిక వేత్తలు, వ్యాపార దిగ్గజాలకు సబ్సిడీల పేరిట వందలు.. వేల కోట్లు ధారపోయడం కాదు. అంతే కాకుండా పాలకులకు పేదలంటే ఒకింత సానుభూతి కూడా ఉన్ననాడే వారి ఉన్నతి కోసం ఆలోచించగలరని వెనుకటికి కొందరు విశ్లేషకులు సెలవిచ్చి ఉన్నారు. సరిగ్గా అటువంటి దృక్పథమే కలిగి ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి తపించిపోయేవారు. ఏ చిన్న అవకాశం ఉన్నా వారి బాగోగుల కోసం ప్రయత్నించేవారు. వారి కష్టంలో సుఖమై.. కంచంలో మెతుకై నేనున్నాను అని భరోసా కల్పించేవారు. నేడా రీతి పాలన దూరమై పేదలంతా ఆవేదనకు లోనవుతున్నారు.

జగదాంబ:

అమ్మఒడి, ఆరోగ్య **శ్రీ, ఆసరా, చేయూత,** మహిళలకు వడ్డీలేని రుణా**లు, జగనన్న కాలనీలు,** ఫీజు రీయింబర్స్‌మెంట్, **ఆటోడ్రైవర్లకు వాహన** మిత్ర, తూరుపు తెల్లారగా**నే వృద్ధులు, వికలాం**గులు, ఒంటరి మహిళల**కు పింఛన్లు అందించి సం**క్షేమ పాలన అంటే ఇదీ అని నిరూపించారు నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. ఆ సంక్షేమాన్ని పేదలకు అందించేందుకు వలంటీర్లు ఉరుకులు పరుగులు తీసేవారు. ఇలా ఎదురెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేసే ఒరవడి జగనన్నే ప్రారంభించారు. అంతకు ముందు కర్ర లేనిదే కదల్లేని పండు ముదుసలి వారు కూడా ఎంత దూరమైనా.. మరెంత భారమైనా ఎమ్మార్వో కార్యాలయాలకు వెళ్లాల్సిందే. అక్కడ కొండవీటి చాంతాడంత క్యూ ఉంటే ఎక్కడో చోట కూర్చుని నిరీక్షించాల్సిందే. అదృష్టం బాగుంటే ఆరోజు ఏ చీకటి పడే వేళకో పెన్షన్ డబ్బులు అందేవి. లేదంటే కార్యాలయ బంట్రోతు వచ్చి 'వెళ్లండి వెళ్లండి.. టైమైపోయింది' అని గెంటేసేవారు. జగనన్న ఈ రివాజుని రివర్స్ చేశారు. అవ్వాతాతలు మంచంపై నుంచి లేవక ముందే వారి చెంతకెళ్లి లేపి మరీ పింఛన్ అందజేసే కొత్త పద్ధతి మొదలుపెట్టారు. వారికి బతుకుపై కొత్త ఆశలు చిగురింపజేశారు. ఇలా ఒకటేమిటి అన్ని వర్గాల వారికి జగనన్న ఆర్థిక భరోసా కల్పించారు. తాను పదవి చేపట్టిన వెంటనే ప్రజలకు పథకాలు అందిస్తూ వచ్చారు. పథకాల అమలు కోసం నెలలు, సంవత్సరాలు తీసుకోలేదు. ఎక్కడా కల్ల బొల్లి కబుర్లు చెప్పలేదు. ఎన్నికల ముందు ఎంత



చిత్తశుద్ధితో వాగ్దానాలు చేశారో.. అంతే చిత్తశుద్ధితో పథకాలను పేదల ముంగిటికెళ్లి మరీ అందజేశారు. తాను లేని చోట తన ప్రతినిధి ఉండాలన్నట్టు 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ప్రజల బాగోగులు తెలుసుకున్నారు. పథకాలు అందని వారికి ఎందుకు అందలేదో తెలుసుకుని తాను ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా దరఖాస్తు చేయించి అర్హత ఉంటే వెంటనే ఆయా పథకాలు వారికీ అమలయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

నేటి పరిస్థితి..?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు ఇంటి తలుపు తట్టి మరీ ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేక పేదలు అల్లాడుతున్నారు. జగనన్న అమలు చేసిన పథకాలన్నీ అమలు చేస్తామని గద్దెనెక్కిన ఇప్పటి ప్రభుత్వం ఆ దిశగా ముందుకు సాగక దిక్కు లేని పక్షుల్లా మారారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అన్నారు గానీ.. దాన్ని ఎప్పటికప్పుడు వాయిదా వేస్తుండటంతో ఆడపడుచులంతా విసిగిపోయారు. జగనన్న ఆరోగ్య సురక్ష అంటూ ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందిస్తే.. ఇప్పుడు కనీసం వీధుల్లో ఉచిత వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు కాక దిగాలు పడ్డారు.

నాటి మాటలేమయ్యాయి?



పాదయాత్ర సందర్భంగా ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి అమ్మ ఒడి ఇస్తామని కూటమి నాయకులు చెప్పారు. వాళ్లు పదవిలోకి వచ్చి ఇప్పటికి ఎనిమిది మాసాలు కావస్తోంది. అమ్మఒడి సంగతి అతీగతీ లేదు.

– నాయిని సత్యవతి, దుర్గామాంబ సమాజం, జీవీఎంసీ 35వ వార్డు

కానరాని వైద్య సేవలు..



జగనన్న ప్రభుత్వంలో గొప్ప గొప్ప ఆస్పత్రులకు దీటుగా ఆరోగ్య సేవలు అందించారు. ఇప్పుడు ఆస్పత్రుల్లో కనీసం పట్టించుకునే వారులేరు. వైద్య పరీక్షలు, సేవలు కానరావడం లేదు. డబ్బు ఖర్చు చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

– దశాయి ఈశ్వరమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

ఆసరా లేక.. అప్పుల పాలయ్యాం



వైఎస్సార్ ఆసరా పేదలకు సంజీవనిలా ఉండేది. వడ్డీ వ్యాపారుల నుంచి కాపాడింది. జగనన్న ఇచ్చిన ఆసరా సొమ్ముతో చిరు వ్యాపారాలు చేసుకుని కుటుంబంతో చింత లేకండా జీవించాం. ఇప్పుడు ఆసరా లేదు.. భరోసా లేదు. అప్పులే మిగిలాయి.

– వరలక్ష్మి, పూర్ణామార్కెట్. జీవీఎంసీ 35వ వార్డు

ధైర్యం సన్నగిల్లింది..



జగనన్న ఆటో, కారు డ్రైవర్లకు వాహనమిత్ర ఇచ్చి ఆదుకునేవారు. వాటితో వాహనాల ట్యాక్స్, ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టుకునే వాళ్లం. ఇప్పుడా ధైర్యం పోయింది. ఆటో తిరిగితేనే పూట గడిచే పరిస్థితి వచ్చింది. జగనన్న ప్రభుత్వం విలువ తెలుస్తోంది.

– సత్యబాబు, ఆటోడ్రైవర్, స్ప్రింగ్‌రోడ్డు, జీవీఎంసీ 35వ వార్డు

చేదోడు దూరమైంది..



చేదోడు పథకం ద్వారా జగనన్న రూ.లక్ష వరకు ఇచ్చేవారు. ఆ డబ్బులతో సొంతంగా వ్యాపారాలు చేసుకునే వాళ్లం. ఎవరి దగ్గర పని చేయకుండా గౌరవంగా బతికే వాళ్లం. కుట్టుమిషన్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకునే దాన్ని. నేడు చేదోడు దూరమైపోయింది.

– సత్యవతి, పూర్ణామార్కెట్ పూలసందు, జీవీఎంసీ 35వ వార్డు

తోడు కోల్పోయాం..



జగనన్న ఎవరినీ వదలకుండా చేయి పట్టి నడిపించారు. ఆయన హయాంలో అన్ని వర్గాల వారు గుండెలపై చేయి వేసుకుని నిశ్చింతగా బతికారు. నేడు తోడు లేని వాళ్లమైనట్లు అనిపిస్తుంది. ఆయనందించిన పథకాలతో ఎన్నో కుటుంబాలు ఏ చీకూ చింతా లేకుండా బతికాయి.

– సన్యాసిరావు, వెలంపేట, జీవీఎంసీ 35వ వార్డు

అల్లాడుతున్నాం..



ఒంటరి మహిళలకు కుటుంబ సభ్యుల నుంచే బాసట దక్కేది కాదు. అటువంటి వారిని జగనన్న గుర్తించారు. ఒంటరి అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా కల్పించి ఆదుకున్నారు. నేడు ఎలాంటి సాయం లేక అల్లాడుతున్నాం.

– రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

మరింత ఆలస్యం తగదు



కూటమి ప్రభుత్వం హామీలు, వాగ్దానాలు నిలబెట్టుకోవాలి. పేదల కోసం ఆలోచించి ఎన్నికల ముందు ఇస్తామన్న పథకాలను అమలు చేయాలి. పథకాల అమలుకు మరింత సమయం తీసుకోకూడదు. ఇప్పటికే ఎనిమిది మాసాలు గడిచిపోయాయి.

– రాజులు, రామకృష్ణానగర్, జీవీఎంసీ 35వ వార్డు

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

మహిళా కళాశాలలో నేషనల్ పీరియాడిక్ టేబుల్ డే



విద్యార్థినులు మాగ్నటిక్ బోర్డుపై రూపొందించిన ఆవర్తన పట్టిక

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నేషనల్ పీరియాడిక్ టేబుల్ డే నిర్వహించారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగం అధ్యాపకురాలు విద్యార్థులచే ఆవర్తన పట్టిక నమూనా ఏర్పాటు చేసి, మూలకాల ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాగ్నటిక్ బోర్డుపై చేసిన ఆవర్తన పట్టిక నమూనా ఆకర్షణగా నిలిచింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల అధ్యాపకులు, విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర అధ్యాపకులు బి. సంతోషి, అనూష, ఎ. హైమావతి, వి. అనిత, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నివేదిత, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. గీతాంజలి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భీష్మ ఏకాదశికి ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో గల శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమై ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఆలయం ఆవరణలో సంకీర్తనలు, భక్తిగీతాలాపన జరగనున్నట్లు ఈవో రమాబాయి తెలిపారు. అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.

గర్భిణులకు మాతాశిశు కార్డుల పంపిణీ



గర్భిణులకు కార్డులు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్ వల్లి, ఆశ వర్కర్ లీలావతి

అల్లిపురం: గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకుని, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్ సూచించారు. ప్రకాశరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు సలహాలు, సూచనలు అందజేశారు. వారికి మాతా, శిశు సంరక్షణ కార్డులు అందజేశారు. ప్రతి నెల క్రమం తప్పకుండా మందులు వాడాలని, పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. బాలింతలు బిడ్డలకు ముర్రుపాలు అందించాలన్నారు. ఆరు నెలల వరకు తల్లి పాలు బిడ్డలకు పడితే శ్రేయస్కరం అన్నారు.

అరుణాచలంలో వివేకానంద సంస్థ సేవలు



సాధువులకు అల్పాహారం అందజేస్తున్న సంస్థ అధ్యక్షుడు అప్పారావు

దాబాగార్డెన్స్: పాతనగరానికి చెందిన స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం అరుణాచలం పుణ్యక్షేత్రం వాయు లింగం సమీపంలో పలువురు సాధువులకు అల్పాహారం అందజేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ వివేకానంద సంస్థ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సంస్థ దర్శించుకుంటున్న అన్ని పుణ్యక్షేత్రాల్లో నారాయణ సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీరామ్, రమా ప్రియ, జనని తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



మృతి చెందిన సత్యనారాయణ

అల్లిపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ ట్రాఫిక్ ఎస్.ఐ కె. లక్ష్మి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గత జనవరి 10వ తేదీ రాత్రి 7.20 గంటల సమయంలో సౌత్ జైలురోడ్డు, భీమ్‌నగర్ వద్ద బేత సత్యనారాయణ అనే సుమారు 70 సంవత్సరాల వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ఈ నెల 6వ తేదీన మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడు తన పేరు తప్ప ఊరుపేరు, ఏ ప్రాంతం తెలియజేయలేదన్నారు. మృతుడిని గుర్తు పట్టిన వారు 9440796041 నంబరులో గాని టూటౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గాని సంప్రదించాలని కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ఏయూక్యాంపస్: పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని పోషకాహార నిపుణురాలు షీలా కృష్ణస్వామి అన్నారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆరోగ్యం–పోషకాలు పరస్పరం ఆధారంగా సాగుతాయన్నారు. కాలిఫోర్నియా బాదంలో 15 రకాల పోషకాలు ఉంటాయని, గుండె ఆరోగ్యానికి బాదం మంచిదని పేర్కొన్నారు.

స్వీయ రక్షణతోనే వ్యాధుల నివారణ



కృష్ణాగార్డెన్స్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా విభాగం సూపర్‌వైజర్ మురళి



మిరపకాయల వీధిలో మంచినీటి డ్రమ్ముల్లో దోమ లార్వాలు గుర్తిస్తున్న ఆశ వర్కర్

అల్లిపురం: వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని భీమ్‌నగర్ మలేరియా సూపర్‌వైజర్ మురళీ సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కృష్ణాగార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో సిబ్బందితో కలసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. మంచి నీటి నిలువ ఉంచే డ్రమ్ములు వారంలో ఒక రోజు ఖాళీ చేయాలని, వాటిని ఆరనిచ్చిన తర్వాత మరుసటి రోజు నీటిని నిలువ చేసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. మనీప్లాంటు వంటి మొక్కల గోలాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. తద్వారా దోమల లార్వాలు అభివృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. ఇంటి ఆవరణలో తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఉండకుండా చూసుకోవాలన్నారు. తద్వారా జ్వరాలు రాకుండా నివారించవచ్చన్నారు.

కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధిలో..

కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మిరపకాయలవీధిలో ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి ఆశ వర్కర్ లీలావతి వెళ్లి మంచినీటి డ్రమ్ముల్లో దోమల లార్వాలు గుర్తించే పని చేపట్టారు. పరసరాల పరిశుభ్రత కోసం అవగాహన కల్పించారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలకు నేక్ బి++ గుర్తింపు



హర్షం వ్యక్తం చేస్తున్న యాజమాన్యం

దాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలకు ప్రతిష్టాత్మక 'నేక్ బీ++'గ్రేడ్ లభించింది. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ కమిటీ గత ఏడాది డిసెంబర్ 17, 18 తేదీల్లో కళాశాలను రెండు రోజుల పాటు సందర్శించింది. కమిటీ చైర్మన్‌గా ప్రొఫెసర్ మదాంబి కేతజయరాజ్, మెంబర్ కో ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ శ్రీకృష్ణ మహాజన్, మెంబర్‌గా డాక్టర్ శరత్ బోర్కటి కళాశాలను తీర్చిదిద్దిన వైనం పరిశీలించింది. విద్యార్థుల అకడమిక్ పరీక్షల ఉత్తీర్ణత శాతం, ప్రాంగణ ఎంపికలు, ఉపాధి కల్పన, ఎన్ఎస్ఎస్ ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యార్థుల క్రమశిక్షణ, అధ్యాపకుల ఆదర్శ భావాలు, పనితీరు, కళాశాల వాతావరణం, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఈ నెల 6న కళాశాల యాజమాన్యానికి నేక్ బీ++ గ్రేడ్ వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సమాచారం అందుకున్న కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు కదారి కుమార్, డాక్టర్ షాహిద్ అలీ, ఎంసీహెచ్ కిషోర్ బాబు, సీహెచ్ భరత్, వైస్ ప్రిన్సిపాళ్లు ఎస్‌వీ బాబ్జి, ఎస్. హిమశేఖర్ హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర సంచాలకుడు పి. రామకృష్ణారెడ్డి, నోడల్ అకడమిక్ అధికారి ఎస్. వెంకటరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, ఆదిత్య విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఎస్. సుగుణారెడ్డి, అధినేత నల్లమిల్లి శేషారెడ్డి కళాశాల సిబ్బందిని అభినందిస్తూ మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

బాలికకు న్యాయం చేయాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు తదితరులు

సీతమ్మధార: సింహాద్రిపురంలో నివాసం ఉంటున్న జీవీఎంసీ క్లాప్ డ్రైవర్ కుమార్తెపై లైంగిక దాడి జరిగిన ఘటనను నిరసిస్తూ జీవీఎంసీ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రదర్శన నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పి.మణి మాట్లాడుతూ ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర హోం మంత్రి స్పందిచాలని, బాధిత బాలికకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్యం, డ్రగ్స్, నీలి చిత్రాలు, సాహిత్యాన్ని అరికట్టాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే నిందితునికి కఠిన శిక్ష వేయాలన్నారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, అధ్యక్షుడు టి. నూకరాజు, జె.ఆర్. నాయుడు, అనిల్, సురేష్ ఈ. ఆదినారాయణ, శ్రావణ్, కె. కుమారి, హేమలత, కొండమ్మ, అనిత, కార్మికులు తదితరులు పాల్గొన్నారు,

బీసీలకు రిజర్వేషన్లు హర్షణీయం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: నామినేటెడ్ పదవుల్లో 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు హర్షణీయమని బీసీ సంఘాల నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోసూరి శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపంలో గల బీసీ సంఘాల కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదముద్ర వేయడం హర్షణీయమని, బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. అలాగే బీసీలకు రక్షణ చట్టం అమలయ్యేలా చూడాలని, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లపై త్వరగా నిర్ణయం తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీసీ మంత్రి ఎస్. సవితకు విజ్ఞప్తి చేశారు.

మాలలు రాజ్యాధికారం కోసం పోరాడక తప్పదు

దాబాగార్డెన్స్: తక్కువ జనాభా ఉన్న కులాలు మాత్రమే ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్నాయని, అధిక జనాభా ఉన్న మనం వారి వద్ద దేహీ అని హక్కులు అడుక్కుంటున్నామని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలు 90 శాతం వరకు ప్రైవేటీకరించబడ్డాయన్నారు. లేని రిజర్వేషన్ కోసం పోరాడే మనం రాజ్యాధికారం కోసం ఎందుకు పోరాటం చేయకూడదని ప్రశ్నించారు. మాలలు నిద్రమత్తు వదిలి మేలుకోవాలని మాల మహానాడు హెచ్చరిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు మాల మహానాడు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ మొత్తాన్ని జోన్‌లోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: విశాఖ కేంద్రంగా వాల్తేర్ డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించడాన్ని సీపీఎం వివాఖ జిల్లా కమిటీ స్వాగతిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖ కేంద్రంగా వాల్తేర్ డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం చేసిన నిర్ణయం ప్రజా విజయమన్నారు. సీపీఎం, వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, రైల్వే ఉద్యోగ సంఘాలు, ప్రజలు సుదీర్ఘకాలం చేసిన పోరాటం, ప్రజా ప్రతినిధుల కృషి ఫలితమని చెప్పారు. పోరాటంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ సీపీఎం విశాఖ జిల్లా కమిటీ అభినందిస్తుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం విశాఖ, ఉత్తరాంధ్రకు నష్టం చేసే చర్యలు, వివక్ష మాత్రం ఆపలేదన్నారు. వాల్తేర్ డివిజన్‌ను ముక్కలు చేసిందని, 1090 కిలోమీటర్ల పరిధి గల వాల్తేర్ డివిజన్‌లో 680 కిలోమీటర్ల పరిధిని ఒడిశాలోని రాయఘడ్ డివిజన్‌లో కలిపిందన్నారు. దీనిలో అత్యంత కీలకమైన కొత్తవలస–కిరండోల్ (కేకే లైన్) రైలు మార్గం, విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి భారీ ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు ఉన్నాయని, ముడిసరుకు, రవాణా, ఎగుమతులు, దిగుమతుల్లో కేకే లైన్ అత్యంత కీలకమైనదని తెలిపారు. వాల్తేర్ రైల్వే డివిజన్ సాలీనా రూ. 10,500 కోట్ల ఆదాయం పొందుతున్నదంటే దీనికి కారణం సరకు రవాణా, కేకే లైన్ అని, అటువంటి కేకే లైన్‌ను విశాఖ నుంచి తొలగించి ఒడిశాలో కలపడమంటే విశాఖపట్నం, ఉత్తరాంధ్ర, ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీయడమేనని, ఆర్థిక నష్టంతో పాటు రాబోయే కాలంలో స్టీల్‌ప్లాంట్, విశాఖ పోర్టు తదితర ప్రభుత్వరంగ సంస్థలకు కష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. విశాఖ రైల్వే జోన్ సాధన తమ విజయంగా కూటమి నేతలు ప్రకటిస్తున్నారని, కానీ కేంద్రం ఉత్తరాంధ్రకు చేస్తున్న నష్టం, వివక్షపైన, కేకే లైన్‌ను రాయఘడ్‌లో కలపడంపై మాట్లాడకపోవడం సరి కాదన్నారు. కూటమి నేతలు ఈ అంశంపై వెంటనే స్పందించి, కేంద్రంపై ఒత్తిడి తేవాలని, నష్ట నివారణ చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. మోదీ ప్రభుత్వం కేకే లైన్‌తో సహా వాల్తేర్ డివిజన్ మొత్తాన్ని విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో కొనసాగించే నిర్ణయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న విశాఖ రైల్వే స్టేషన్ వద్ద నిరసన చేపట్టనున్నట్టు చెప్పారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. పద్మ, వి. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వాసికి ఆశ్రయం



ఏయూటీడీ షెల్టర్‌కు చేరుకున్న మహ్మద్ సిరాజ్

సీతమ్మధార: మానసిక ఆరోగ్యం బాగు లేక చికిత్స చేయించుకోవడానికి ఆస్పత్రికి వెళ్తున్నట్లు చెప్పి విశాఖ వచ్చిన మహ్మద్ సిరాజ్ (55)ను ఫోర్త్ టౌన్ పోలీసుల సమాచారంతో ఏయూటీడీ టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ షెల్టర్ హోం నిర్వాహకులు గుర్తించి ఆశ్రయం కల్పించారు. హైదారాబాద్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన సిరాజ్ వైజాగ్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో సంచరిస్తుండగా హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ చూసి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో స్పందించిన ఏయూటీడీ ప్రతినిధులు ఆయనను షెల్టర్‌కు తరలించారు. అతని వద్ద ఉన్న ఫోన్ నంబర్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు బయలుదేరి వస్తున్నట్లు షెల్టర్ నిర్వాహకులు తెలిపారు.

నేడు శివపార్వతుల కల్యాణ మహోత్సవం



గణేష్ పార్వతి సమేత ఓంకార శివాలయం, ఓం సాయిబాబా మందిరం

దాబాగార్డెన్స్: గొల్లలపాలెంలోని సింగ్ హోటల్ జంక్షన్, శివాలయం వీధిలో వేంచేసిన గణేష్ పార్వతీ సమేత శ్రీ ఓంకార శివాలయం, ఓం సాయిబాబా (షిర్డీ) మందిరంలో శనివారం శివ పార్వతుల 30వ కల్యాణ మహోత్సవం, ఓం సాయిబాబా 19వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు ఓంకార శివసాయి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 10.05 గంటలకు శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు నారాయణ సేవ, సాయంత్రం 6 గంటలకు పల్లకీ సేవ(తిరువీధి ఉత్సవం) జరపనున్నట్టు తెలిపారు. కల్యాణం చేయించుకునే దంపతులకు స్వామి శేషవస్త్రం అందజేయనున్నట్టు చెప్పారు. కల్యాణం చేయించుకునే దంపతులు 8978802451 నంబరులో సంప్రదించాలన్నారు.

రేపు డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి



డాక్టర్ జయగోపాల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాస్తిక సమాజం నాయకులు

మహారాణిపేట: ప్రసిద్ధ హేతువాది, సామాజిక ఉద్యమకారుడు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి. శ్రీరామమూర్తి, జె. రవి తెలిపారు. శుక్రవారం ఆరిలోవలో ఉన్న కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జయగోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాల్యం నుంచి సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలను వ్యతిరేకించిన జయగోపాల్ అంతర్జాతీయ స్థాయి నాయకులని, ఆయన చేసిన సేవలకు అనేక సంస్థలు అవార్డులు కూడా ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్ రాజా, సంతోష్, సునీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.